# గురజాడ అప్పారావు తో



''మధురవాణిని వదలడం అంటే ఏపీ మనస్కరించ కుండా వుంది''- అంటాడు మొదట్లో గిరీశం. గిరీశానికే కాదు గురజాడ అప్పారావుగారికే నాటకం పూర్తి చేశాక మధురవాణిని వదలాలంటే మనస్కరించ లేదు. నాటకకర్తే I am enamoured of her అని అనుకున్నారు పాపం. పాఠకులు కూడా మధుర వాణిని వదలాలంటే నాటకం పూర్తయాక కూడామనతో కబుర్లుచెబుతూ వుండిపోతే బావుండ్ను అని అనిపిస్తుంది. ఇంతెందుకు? కన్యాశుల్కం చదివి మధురవాణి కోసం బెంగ పెట్టుకోనివారుంటారంటే నమ్మశక్యకంకాదు. మధురవాణిని ఎత్తుకుని ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తుంది నిజానికి. ఈ ముక్కే రావిశాస్త్రి గారన్నారొకసారి - మధురవాణి మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి వస్తే ఏంచేస్తారని అడిగా. ఇంటర్వ్యూ ఎందుకండీ టైమ్వేస్ట్- ఎత్తుకుని పారిపోతానని కాబోలు అన్నారు. గురజాడ అప్పారావుగారే తను సృష్టించిన మధురవాణిని మోహించి కాస్త తత్తరపడ్డారు నాటకం పూర్తిచేశాక.

కన్యాశుల్కం వంటి చీమూ నెత్తురూ వున్న పాత్రలతో మహత్తరమైన నాటకం పూర్తిచేశాక అప్పారావు పంతులుగారు ఎంత restless గా feel అవుతారో వూహిస్తే 'మధురవాణి' పాత్ర గురించి ఆయన బెంగ కొంత అర్థం చేసుకోవచ్చును. తిక్కన గారు మహాభారత రచన పూర్తిచేశాక అలాగే restless గా feel అయి వుంటారు. అప్పారావుగారు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారికి రాసిన లేఖలో Have I made vice attractive? అని మధురవాణి గురించి మథన పడ్డారు.

చారిత్రాత్మకమైన యీ అప్పారావుగారి లేఖను గుడిపాటి వెంకటచలంగారు తెనుగు చేశారు. చలంగారి అనువాదాన్ని యథాతథంగా యిక్కడ పొందుపరుస్తున్నాను.

''కన్యాశుల్కం ప్రూఫులు దిద్దుతున్నాను. చదువుతోంటే నాకు ఆహ్లాదం కలుగుతోంది. గ్రంథకర్త తన పుస్తకాల్ని చదివి తానే ఆశ్చర్యపడితే గ్రంథంలో నిజమైన స్వారస్యం వుందన్నమాటే. గ్రంథకర్తకే పుస్తకం ఆకర్షకంగా వుంటే అందరికీ వుంటుందని నిశ్చయమే. మీనాక్షి వొచ్చిన రంగాలు చాలా జ్ఞానాపాదకాలుగా వున్నాయి. నేను పూర్వ గ్రంధాల్లోంచి ఉదాహరణ లివ్వగలను.

కళా దృష్టితో ఆదర్శవంతంగా చేసినప్పటికీ Artistic Idealisation కూడా Realistic(ఉన్నదున్నట్లు)గా వ్రాసినట్లయితే ప్రజల నీతి అభిప్రాయములకు విరుద్ధంగా వుండే ఘట్టాలు తటస్థించక మానవు. కొంతవరకు నైతిక ఖండనం ప్రత్యేక తత్వాల మీద ఆధారపడి వుంటుంది. మీజాతి పట్టాభి రామమూర్తిగారి

సహవాసంలో మీరు పెరగడం వల్లమీకు అవినీతి అంటే కంటకమని నాకు తెలుసు వేశ్య అనేసరికి అదిరిపడతారు.

కావ్యాల్లోని న్యాయస్మృతి Poetic Justice(కావ్యన్యాయం)తో మారింది నేను జీవితాన్ని చిత్రిస్తున్నాను కళాపరంగా కొంత ఔన్నత్యాన్నిస్తాను

నేను కళారాధకుణ్ణే. ఐనప్పటికీ సంఘం యెడల బాధ్యత వుంది నాకు నా పుస్తకం చదివేవారు నన్ను వొక ప్రశ్న వెయ్యవచ్చు, నేను దుర్మార్గాన్ని ఆకర్షణీయంగా చేశానా అని చెయ్యలేదని నా నమ్మకం మొదటి ముద్రణలో మధురవాణి జీవం లేని ఘోరంగా తయారైంది. ఈ ముద్రణలో ఆమెను పూర్ణంగా చిత్రించాను నేను ఆమెను చూసి భ్రమసి పోతున్నాను. కనుక ఆమెని చివర రంగంలో సంస్కరణం చేశాను ఇంక మీకు అభ్యంతరం వుండకూడదు

పైకి కనబడేదానికన్న బలమైన నైతిక భావాన్ని పొందింది నాపుస్తకం. జీవితాన్ని నేను చులకనగా భావించనని తెలుస్తుంది. హాస్యంతో పొంగిపొయ్యే పుస్తకంలో జీవితంలో గంభీరత్వాన్ని చూపడం చాలా కష్టమైన పని. ప్రయత్నించాను నేను

వేశ్యలోని మానుషత్వాన్ని మరచిపోకండి ఆమె సుఖదుఃఖాలు మీవిగానీ, నావి గానీ అయిన సుఖదుఃఖాలకు ప్రాముఖ్యతలో తీసిపోవు సంఘంలో లెఖ్ఖలేని వ్యభిచారులైన భర్తలూ, భార్యలూ వున్నారు స్పష్టంగా తన వృత్తిని తెలియబరిచే వేశ్య వారందరి కన్న అధమురాలెట్లా అవుతుంది? పైగా వేశ్య వివాహ ప్రమాణాన్ని భగ్నం చెయ్యడం లేదు వీళ్ళవలె

'ఆంత్రోపాలజీ' (పురాతన మనుష్యుల చరిత్ర నుంచి తెలుసుకునే శాస్త్రం) వల్ల మన సాంఘికాభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలిగింది స్పష్టంగా గోచరించే విషయాన్ని కప్పిపుచ్చడం వల్ల ఏమీ లాభం లేదు

వివాహ (Sexual)బంధాలను ఇంతగొప్ప చెయ్యడంలో అర్థమేమిటి? సాంఘిక పరిణామంలో వివాహసంస్థ యొక్క ప్రాముఖ్యతను నేను తగ్గించ చూస్తున్నా ననుకోకండి గడిచిన శతాబ్దంలో ప్రపంచం జ్ఞానంలో మారింది. వివేకవంతులైన మనుష్యులు పాత అభిప్రాయాల విలువను పరిశీలించడం ప్రారంభించారు. వివాహసంస్థ మానవాభివృద్ధికి తోడ్పడిన మాట వాస్తవమే కాని వివాహబంధం ఛేదించకూడదనే అభిప్రాయం వల్ల ఎన్ని చెప్పతరంకాని దారుణ కృత్యాలు తటస్థిస్తున్నాయో మరవకూడదు అంతేకాదు ఇంగ్లీషు వారిలో పెళ్ళి (సివిల్ కాంట్రాక్టు) చట్ట సంబంధమైన వొడంబడికగా వుంది. షెల్లీ, జార్జి ఇలియట్ దాన్ని తోసేసి తిరిగారు (Modern Woman will rewrite history) నవీనయుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖింపబోతోంది

గొప్ప నవలలో ప్రేమకథ అపురూపమవుతోంది లేక ప్రాముఖ్యతలేని స్థానానికి

వెడుతోంది ఈ స్త్రీ పురుష శరీర ఆకర్షణ విషయమై వాఙ్మయం ఎందుకు అనంతమైన భేదాలతో చిత్రిస్తుంది? కామ (Sexual)సంబంధమనే మాటను గమనించండి శుద్ధ శరీర సంబంధాన్ని స్పష్టంగా చూపుతోంది వాడిలిపోయిన యాభై ఏళ్ళ సుందరిని యువకుడెందుకు మోహించడు? చక్కగా వికసించిన రోజా పువ్వువలె, బాగా వుడికే కూరవలె యవ్వనవంతురాలు యింద్రియాల్ని ఆకర్షిస్తుంది. పాచిన ఆహారం గాని, వాడిలిని పువ్వుగాని ఎంత అయిష్టమో ముదిరిన స్త్రీ కూడా అంతే ముందెప్పుడో రొట్టె పాచి పోతుందనిగాని, రోజా వాడిలి పోతుందని గాని అవి కొత్తగా, మనోహరంగా వున్నప్పుడు ఎవడన్నా అనుభవించడం మానుకుంటాడా? జీవితమూ, సౌందర్యమూ అశాశ్వతములనే వేదాంతం సరైనది కాదు పైగా తరుణ మందే అనుభవించాలనే అభిప్రాయానికి బలమైన ప్రోత్సాహ కారణమౌతుంది. పాపం అమితత్వంలో వుంది అమితత్వం ఎక్కువ కాలం ఎట్లాగూ దాగదు

జీవితంలోనూ, వాఙ్మయంలోనూ కూడా మోహం తన ఉచిత స్థానాన్ని అధిష్ఠించాలి ప్రస్తుతం దానికి అమితమైన ప్రాముఖ్యాన్నిస్తున్నారు 'కేటో' తన భార్యని ఎవరికో ఎరువిచ్చాడు పురాణాలు చదవండి తెలుస్తుంది

నిజంగా జరుగుతున్న సంగతుల్ని చూడాల్సి వొస్తుందని కళ్ళు మూసుకోవద్దు డాక్టరులాగు కత్తి తీసి పుండుకోసి పరీక్షించాలి ఆశయంగా చూపించ తగినది మానవుడి ప్రేమ క్రైస్తు బోధించిందిగాని, బోధించాడని అనుకునేది గాని అదే తన కవిత్వంలో షెల్లీ చాటింది ఆ ప్రేమే జీవించే మతం కింద బుద్ధుడు బోధించింది ఆ ప్రేమనే బౌద్ధమతాన్ని యేనాడు నాశనం చేసిందో ఆనాడే హిందూదేశం మతీయమైన ఆత్మహత్య చేసుకుంది

ఈ ఆచారాలనే యెర్రకాంతిని పరిశోధనాలయం (Laboratory) నుంచి తొలిగించి, యీ కామ సంబంధాన్ని పూర్తిగా, వివరంగా పరీక్షించాలని నా కోరిక చరిత్రాత్మ జీవశాస్త్రాత్మకంగా (biologically) పరిరక్షించి, దాని సరియైన స్థానాన్ని యీ కామానికి ప్రసాదించి తీరాలి జీవితంలో యధార్థాన్ని మీరు ప్రేమిస్తున్నారు 'సెన్టిమెంటు'లోని యదార్థాన్ని యెందుకు ప్రేమించరు? పురుషుడి అధికారం కింద యెంత నీచమైన బానిసత్వాన్ని స్త్రీ అనుభవిస్తుందో నాకు తెలుసు మీరు మాత్రం ఆలోచించుకోలేరా?

బీదలూ, కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భర్తల విషయమై ఆ భార్య లేమనుకుంటూ వుంటారో ఆలోచించుకోండి మీ చుట్టూ కనపడే కుటుంబాలను 'స్టడీ' చెయ్యండి కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భార్యలో? అంటారు మీరు కాని వారు పురుషుల బానిసలే కద మనకన్న ఆడవాళ్ళు ఎక్కువ పవిత్రత చూపాలని విధిస్తున్నాము దానివల్లనే యింత వ్యత్యాసం కలుగుతోంది నిర్మలులుకాని పురుషులందరినీ మీరు ద్వేషిస్తారనుకోండి పనిబట్టి

ఇంక మీరు ద్వేషించని స్నేహితులు ఎంతమంది మిగులుతారు? స్త్రీకి సాధ్యమైన దానికన్నా ఎక్కువ ప్రజ్ఞను పురుషుడు కోరుతున్నాడు గనక స్త్రీ బాధపడుతోంది. తన మనసు తీరేట్టు, స్త్రీ తనని పూజించడం లేదని పురుషుడు దుఃఖభాజను డైనాడు. 'జెలసీ' అంటే యేమిటి? భర్త అందంగా లేడు. భార్య అతని రూపాన్ని యెట్లా మెచ్చుకుంటుంది? అందంగావున్న పర పురుషుడి యెడల అనురాగాన్ని ఆపుకోలేదు. కాని అట్లాంటిది మహాపాతకమంటారు మీరు. ఎంత దుస్సాధ్యం! భర్త చవట అయినా భార్య మాత్రం ఆయన మేధాశక్తుల్ని మెచ్చుకునే తీరాలి. ఇట్లా ఎంతవరకన్నా, ఎన్ని విషయాల్లోనో వూహించుకోవచ్చు యీ అగచాట్లు

జపానులో గెయిషా పద్ధతి సంగతి వినేవుంటారు మీరు కామ విషయమైన నీతి జపానులో చాలా తక్కువ కాని వారి జాతీయతకికాని, మత జీవనానికి గాని, భాగ్యసమృద్ధికి గాని యే లోటూ రాలేదు. ఆశ్చర్యం యేమిటంటే, ఆ దేశంలోనే ముఖ్యంగా గొప్ప రాజకీయ ఆదర్శాలున్నాయి

స్నెంటిమెంట్ అవతల పెట్టి యీ కామవిషయమై నా అభిప్రాయం యిదీ సంఘం వల్ల విధింపబడిన చట్టాలు వున్నాయి, వాటిని మన్నించడం మన విధి కామ వ్యవహారాన్ని శాంతంగా నడిపించేందుకు అవి వుండవల్సిందే

ఆ చట్టాలు అన్యాయమని తలిచి వాటిని బహిరంగంగా సంస్కరింప వూనినప్పుడు తప్ప వాటిని మీరడం గొప్ప నేరం ఆ చట్టాలకి లోబడి వున్నా వాటిని పరీక్షించి వాటి న్యాయాన్యాయ విచారణ చేసేందుకు ప్రతివారికీ స్వతంత్రం వుంది నిర్మలత్వం అవసరం అనే స్నెంటిమెంటుని నేను మన్నిస్తాను. కాని ఆ స్నెంటిమెంటు యొక్క నిజస్వభావ మేమిటి, దాని హద్దు లెంతవరకు, దాని అసలు అర్థమేమిటి, అది ఏ మార్గంగా పని చేస్తోంది, నిర్మలత్వ మంటే దేంటోవుంది? నేను నమ్ముతున్న దేమిటంటే ప్రస్తుత సాంఘిక శాసనాలు ఈ కామ విషయమై ఎవరికీ అందుబాటులో లేనంత కఠినంగా వున్నాయి కనకనే నేరాలు మీరిపోయినాయి మనలో మనం వాస్తవం వొప్పుకోవలసిన కాలం వొచ్చింది ఇదంతా ఎందుకు వ్రాశానంటే నేను వ్రాయబొయ్యే నాటకం యీ సమస్యల్ని గురించి'' అని వ్రాశారు అప్పారావుగారు

విజయనగరంలో ఆనందగజపతి మహారాజా వారి సంస్థానంలో వారి అధీనంలో రామస్వామి, వెంకటస్వామి అనే యిద్దరు వేశ్యా రత్నాలు వుండేవారట వారిలో 'రామస్వామి' కడు పెంకి. వారిరువురినీ గురజాడ అప్పారావు పంతులుగారు కంట్రోలు చేసేవారట ఈ రామస్వామి, వెంకటస్వామి అనే ఆనందగజపతి మహారాజా వారి ఉంపుడుకత్తెల గురించి కృష్ణశాస్త్రి గారికి, రాయప్రోలు వారికీ బాగా తెలుసు ఇది యిలా వుండగా విజయనగరంలో 'మహాలక్ష్మి' అనే వేశ్యారత్నము వుండేదట. ఆవిడ మహా సంగీత విద్వాంసురాలు. ఆనందగజపతి

మహారాజు గారైనా ఆమెకు మూడ్ వచ్చి ఆమె పాడితే వినాల్సిందేకాని పాడమంటే ఆమె పాడేది కాదట మొట్టమొదటి కన్యాశుల్కంలో ఈ మహాలక్ష్మి అనే వేశ్యారత్నం పాత్ర వుంది. ఈమె గిరీశం వుంచుకున్న సాని అని మొదట్లో వుంది తరువాత ఈమె పేరు కొట్టేశారు అప్పారావుగారు

ఆనందగజపతి మహారాజాగారికి బాలాజీనాయుడు అనే ఏజెంటు మద్రాసులో వుండేవాడు వారి మేనగోడలు రామతిలకం అనే ఆమె ఎల్లప్పుడూ మహారాజా వారితోనే గడిపేది ఆమెకు రాజావారి వద్ద ఎక్కువ స్వేచ్ఛ వుండేది ఈ రామతిలకానికి తాగుడు అలవాటు బాగా వుండేది అప్పుడప్పుడు తప్పతాగి స్పృహ తప్పిపోయేది ఈమెను అప్పారావుగారు మధురవాణిగా స్వకపోల కల్పితంగా తీర్చిదిద్దారు కన్యాశుల్కం రెండవ ఎడిషన్ లోని మధురవాణి మీద అప్పారావుగారి పై పరిచయాల సారం అంతా దిగిందని అనుకోవచ్చు

అప్పారావుగారు రామస్వామి అనే వేశ్యా రత్నంతో మహారాజావారితో కలిసి పేకాట ఆడి వుండవచ్చును ఈ వేశ్యలు బ్రాందీ పుచ్చుకునేవారట మధురవాణిగాని గిరీశంగాని పంతులు తప్ప (ఒక్క రా ప్పపంతులు తప్ప) ఎవరూ మద్యం సేవించరు గిరీశానికి చుట్ట కాల్చే వ్యసనం వుండేది గురుజాడ అప్పారావుగారు మాత్రం కోకో వైన్, పురిడి పిట్ట మాంసం తీసుకున్నట్లు ఆయన రాతల్లో వెల్లడయింది రీవారాణి సేవలో అప్పారావుగారు కొన్ని అలవాట్లు చేసుకున్నట్లు తెలుస్తున్నది ఈ డైరీలు నోట్సులు పరిశీలించి తిరగరాసిన సందర్భంలో నార్లవారు అప్పారావు పంతులుగారి మీద అభిప్రాయాన్ని మార్చుకున్నారు అప్పారావుగారు ఆనందగజపతి మహారాజుకి రామస్వామికి వెంకటస్వామికి మధ్య 'డాఫర్' పనిచేశారని విసుక్కున్నారు వ్యక్తిగత శీలం స్వచ్ఛత విషయానికి వస్తే వీరేశలింగం పంతులుగారితో అప్పారావుగారు తులతూగలేరని గమనించి కోపం తెచ్చుకున్నారు సాహిత్య అకాడెమికి రాస్తున్న గురజాడ మీద మోనోగ్రాఫ్ ఆ కారణంచేత ఆలస్యమయింది కూడా రామస్వామిని వుంచుకున్నారని ఆనందగజపతి మహారాజావారి మీద భిన్నాభిప్రాయాలు కలిగి వున్నారుగాని అప్పారావుగారికి రామస్వామి మీద కోపం లేదు అది ఆమె వృత్తి అనివారు సరిపెట్టుకున్నారు అప్పారావుగారు రామస్వామి బాధ్యత స్వీకరించాక (H H )ఆనందగజపతిమహారాజావారు యిలా అన్నారని అప్పారావుగారు రాసుకున్నారు

'విద్యావంతులు ఆడవారి పట్ల దయగా ఉంటారు మీకు అధికంగా ఋణపడ్డాను చర్మం కోసి యిచ్చినా మీ ఋణం తీర్చుకోలేను' మహారాజావారికి పత్నీ వియోగం (15-5-1896) సంభవించాక రామస్వామి వచ్చి రాజావారితో జీవించసాగింది ఆమెగురించి అప్పారావుగారు తీసుకున్న శ్రద్ధను కీర్తిస్తూ యింకా రాజావారు యిలా అన్నారట-'లోకులు ఉదాత్తమైన ఉద్దేశాలను అర్థం చేసుకోలేరు మిమ్మల్ని చూసి అతగాడు ఆ పిల్ల మీద మర్లుకొని ఆమె వద్దకు వెళుతునాడేమో, లేదా ఆవిడ ద్వారా ఏదో లాభం చేసుకొందామనుకొంటున్నాడు కాబోలునన్నో,

కాదంటే రాజావారి ఇచ్ఛకం కోసం ప్రాకులాడుతున్నాడనో అంటూ అజ్ఞానులూ, అవివేకులూ పరిపరి విధాల లేనిపోని నిందలు వేయడానికి ఆస్కారమున్నా దేనినీ లక్ష్య పెట్టకుండా మీరు ధైర్యంగా మలుచుకొచ్చారు' ఇవి ఆనందగజపతి నుండి అప్పారావుగారు పొందిన ప్రశంసలు అయితే యీ అనుభవం లేకపోతే గురజాడ మధురవాణిని తీర్చిదిద్ద గలిగి వుండేవారు కాదేమో! చూసీచూడనట్లు అప్పారావుగారు ఆడవాళ్ళను లోతుగా పరిశీలించేవారు

ఆనందగజపతి మహారాజావారి స్వంత నౌఖరీలో ఉండే భోగం పాపలందరినీ అప్పారావుగారు చాలా నిశితంగా పరిశీలించారు వాళ్ళ కళ్ళలోనే వారి స్వభావాన్ని, శీలాన్ని చదవడానికి ప్రయత్నించారు కరుణ కళ్ళు లోతు కళ్ళు రామస్వామి కనుబొమ్మలు విశాలంగా సోగగా తెలివితేటలను సూచిస్తాయి భాస్కరం కళ్ళు నిద్ర మత్తుతో తూగుతూ ఉంటాయి చంద్ర వదనవి ప్రశాంతమైన చూపులు ఆమె చెల్లెలు కళ్ళలో అన్నీ ఆలోచనలే-యిలా సాగేవి అప్పారావుగారి ఆలోచనాలోచనలు మధురవాణిని తీర్చి దిద్దడానికి యీ అనుభవాలు చాలవా? మధురవాణికి తల్లి చెప్పిన నీతులు అవి సౌజన్యారావు వద్ద ఏకరువు పెడుతుంది ఒకటి 'చెడని వారిని చెడగొట్టవద్దని' ఇంకోటి 'మంచివారి యెడల మంచిగాను, చెడ్డవారి యెడల చెడ్డగానూ ఉండమని', 'మొగవాడికయినా, ఆడదానికయినా నీతి వుండాలి' అంటుంది ప్రారంభంలో మధురవాణి, మధురవాణికి డబ్బు విలువ బాగా తెలుసు-''కొద్ది కాలం వుండే యవ్వనాన్ని ఆధారంగా చేసుకొని బతికే మా కులానికి వలపు ఒక్కచోటే (అది ఎక్కడంటే) బంగారం మీద శృంగారం వన్నె చెడిన దగ్గర్నుంచీ బంగారం గదా వన్నె తేవాలి'' అంటుంది కరటక శాస్త్రులతో మధురవాణి గురించి సౌజన్యారావుపంతులు యిలా చక్కగా అంటాడు-'నువ్వు మంచిదానివి! యెవరో కాలు జారిన సత్పురుషుడి పిల్లవై వుంటావు (విశ్వామిత్రుడు+ మేనక=శకుంతల లాగ) యీ వృత్తి మానలేవా? స్థితిలోపమా? అంటాడు మధురవాణి కన్యాశుల్కం నాటకాంతమందు వృత్తి మానేస్తుంది

**మధుర:** రండి రండి కామ్రేడ్ గురజాడ గారూ!

**గురజాడ:** ఏమిటీ వికారం?

**మధుర:** రెండు కాళ్ళ గాడిదలు మిమ్మల్ని కవిగా గుర్తించలేదనీ, అటువంటి గాడిదలకి యింకా సన్మానాలు జరుగుతున్నాయనీ (నవ్వుతుంది)

**గురజాడ:** గాడిద లేమిటి? నన్ను చూసేనా ఆ నవ్వు

**మధుర:** రామ, రామ! శ్రీశ్రీ మాటలకి నవ్వొచ్చి అలా నవ్వాను కమ్యూనిస్టులు మిమ్మల్ని కామ్రేడ్‌గా మార్చారని అంటేనూ, (నవ్వుతుంది)

**గురజాడ:** నిన్ను ముద్దుచేసి నా పీకలమీదికి తెచ్చుకున్నాను

**మధుర:** అవురా యెంత మాటన్నారు? మీ రచనలన్నీ నష్టమైపోయి ఒక్క దేశభక్తి గీతం

మిగిలినా చాలన్నాడు, మీ శిష్యుడు కామ్రేడ్ శ్రీశ్రీ అంటే కన్యాశుల్కం నష్టమైపోయి మధురవాణి లేకపోయినా యీ లోకానికీ అందులో ఈ కళింగ రాజ్యానికీయేవీ లోటు వుండదనే గదా తాత్పర్యం?

**గురజాడ:** నువ్వు అడిగావు గనక చెబుతున్నాను విను. వెనక సభల్లో రాయప్రోలు గీతం 'ఏదేశ మేగినా యెందుకాలిడినా, పొగడరా నీ తల్లి భూమి భారతిని' పాడుతూ వుంటే, మన కుర్రాళ్ళకి 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని పాడేలాగా దేశభక్తి గీతం రాసిచ్చా-వాళ్ళు అది పాడినపుడల్లా వీళ్ళు యిది పాడే వారు అదీ కధ

**మధుర:** అందుకా వాళ్ళు మిమ్మల్ని కామ్రేడ్ గురజాడ అన్నారు? (నవ్వుతుంది)

**గురజాడ:** నిన్ను కామ్రేడ్ మధురవాణి అనలేదనా నీకానవ్వు?!

**మధుర:** మీరు వేగుచుక్క అయితే మీకు తోకచుక్క కదా శ్రీశ్రీ మధ్య నేనెవతెను? సానిదాన్ని కామ్రేడ్ అని పిలిచే ధైర్యం యెవరికుంది? మీరు మొదట రాసిన నాటకంలో నేను దిష్టిబొమ్మలా వున్నాను అలా చేశారేమిటి కామ్రేడ్?

**గురజాడ:** వుండు జ్ఞాపకం చేసుకోనీ, బేహద్బీ మొదట్లో రామప్పంతులుంచుకున్న సానిగా కదూ చిత్రిస్తి-అందుకే నిన్నపుడు Colourless Iniquity గా వున్నావన్నాను

**మధుర:** అదుగో మిమ్మల్ని కామ్రేడ్ అన్నందుకు నన్నేదో యింగ్లీషులో తిడుతున్నారు (గునుస్తుంది) మీకిది తగునా?

**గురజాడ:** సొగసైన నీ వంటి స్త్రీకి అలకే అలంకారం Colourless Iniquity అంటే 'అందంలేని పాపం' లాంటిది కోపం తెచ్చుకోకు అన్నట్లు నీకు కామ్రేడ్ గిరీశం ఇంగ్లీషు చెప్పే వాడుకదా

**మధుర:** అతణ్ని కామ్రేడ్ అని పాపం వాళ్ళు అనలేదు మీరంటున్నారు. గిరీశంగారు కొన్నాళ్ళు నన్నుంచుకున్నారు.

**గురజాడ:** వాడి సంగతి నాకా చెప్తావు? మొట్టమొదటి నాటకంలో వాడుంచుకున్న సాని 'మహాలక్ష్మి' నువ్వు కాదు

**మధుర:** మరయితే ఆ మహాలక్ష్మి నెందుకు తప్పించేశారు?

**గురజాడ:** అది వేరే కథ. నేను చెప్పగూడదు. నువ్వు వినకూడదు

**మధుర:** కామ్రేడ్ మహాలక్ష్మి మీరు చెప్పిన మాట వినలేదు అందుకు తీసేశారు. ఆవిడ రణపెంకె అవునా?

**గురజాడ:** ఈ 'కామ్రేడితం'తో నన్ను చంపేస్తున్నావు. ఆవిడ ఆనంద గజపతి మహారాజా వారి ఆస్థాన విద్వాంసురాలు ఆమె పాటవినదల్చిన వారు ఆమె పాడినప్పుడు వినాల్సిందే కాని, మహారాజా వారైనా సరే పాడమన్నపుడు పాడేది కాదు. మహాగొప్ప సంగీత విద్వాంసురాలు సాయంత్రం చీకటి కనుమరుగయ్యే వేళకు అదిభట్ల నారాయణదాసు వంటి హేమాహేమీలు ఆమె యింటివద్ద హాజరయి కల్వంలో భంగుపత్తి నూరుతూ

ఆమెకు చేదోడు వాదోడుగా పనుల్లో కల్పించుకుంటూ పడిగాపులు పడివుండేవారట.

**మధుర:** ఎందుకట?

**గురజాడ:** ఉండీ ఉడిగీ ఆమె ఓ రాగం, ఓ కీర్తన, ఓ పల్లవి విసిరితే పట్టుకుందామని. ఈమెని మద్దెల మహాలక్ష్మి అనికూడా అనేవారు

**మధుర:** బాగుంది. యింతటి మహా సంగీత విద్వాంసురాలినా మీరు ఆ గిరీశానికి సానిని చేసింది!

**గురజాడ:** అదే పొరపాటయింది. ఎస్టేటు ఎస్టేటంతా గొడవ చేస్తే యిక మన ఆబోరు దక్కదని మహాలక్ష్మిని తీసేసి నిన్ను అక్కడ తగిలించాను

**మధుర:** చాల్చాలు! ఆనంద గజపతి మహారాజా వారు ఒకవేళ హఠాత్తుగా మద్దెల మహాలక్ష్మి పాట వినాలని వస్తే అప్పుడు నారాయణదాసుగారు వగైరా మీరంతా మహాలక్ష్మి మంచం క్రింద దాక్కునేవారా?

**గురజాడ:** మంచం కింద దాక్కోవడ మేమిటి? మహారాజా వారెక్కడకూ వెళ్ళరు అందర్నీ వారి వద్దకే పిలిపించుకుంటారు తెలుసా?

**మధుర:** ఏమి మహాకవులండీ మీరు? పూటకూళ్ళమ్మ వస్తే గిరీశం గారు వచ్చి మా మంచం క్రింద దాక్కోలేదా? ఆ సీను మహాలక్ష్మి గారింట్లో మహారాజావారు వస్తే మీ కట్లాటి అనుభవం అయిందేమోనని నా అనుమానం

**గురజాడ:** ఏ సభకయినా, నాటకానికయినా దర్జాగా మహారాజా వారి కూడా వెళ్తే వెళ్తాను మంచం క్రింద దాక్కోవడం ఖర్మ నాకేమి?

**మధుర:** అహః ఊరికే తెలుసుకుందుకు అడిగా. అన్నట్టు మీ బావమరదులిద్దరూ చదువుకుంటూనే సానుల్నుంచుకున్నారని విన్నా మీరు వెళ్ళినపుడు మీ బావమరిది నరసరాజు మీరు వస్తున్నారని జడిసి పొడుగు సుందరి మంచం కింద దాక్కుని వుండవచ్చు కదా!

**గురజాడ:** పొడుగు సుందరెవత్తి?

**మధుర:** అదేమో, మీకే తెలియాలి! (ఇద్దరూ నవ్వుతారు) మీరు యాంటీ నాచ్చా ఆ?

**గురజాడ** : కాక?

**మధుర** : మరైతే సాన్ని మీ నాటకానికి కథానాయికగా ఎంచుకున్నారే!

**గురజాడ:** నా హీరోయిన్ సానై అయినా ఆమెకు తన వృత్తిపట్ల నిజాయితీ వుంది వివాహబంధాన్ని తేలికచేసి పవిత్రులుగా నటిస్తూ వ్యభిచారం చేసే అనేకమంది స్త్రీ పురుషులకన్నా నేను రూపొందించిన సానిదే మంచిదీ గొప్పదీ

**మధుర:** అందుకే కాబోలు, ప్రోనాచి, యాంటీనాచీ అన్న తేడా లేకుండా కామ్రేడ్సంతా మీకు బ్రహ్మరథం పట్టేరు (నవ్వు)

**గురజాడ:** జీవితాన్ని నేనెప్పుడూ చులకనగా తీసుకోలేదు. పైకి హాస్యంగా కనపడే దాని వెనుక బలమైన నైతిక భావాల్ని జొప్పించాను. గ్రహించు, నేను సీరియస్ మనిషిని.

**మధుర:** తెలుస్తోంది నాటకం చివర నాచేతిలో భగవద్గీత పెట్టించి అమ్మయ్య అని మీరు తప్పుకున్నారు

**గురజాడ:** మరి నేను కామ్రేడ్ ని ఎలా కాగలిగాను బేహద్బీ, వుండు; నీ చెవి - (అని మధురవాణి చెవి మెలిపెట్టబోతాడు)

**మధుర:** ఇవుగో మీ కిష్టమైన మామిడి పళ్ళు అదిగో మామిడి తాంద్ర నా చెవి వదిలేయండి

**గురజాడ:** I Shall has be terrible as I was humorous

**మధుర:** మీ యింగ్లీషు బాగుంది గిరీశంగారు యింగ్లీషు మాట్లాడుతూ వుంటే దొరలు మాట్లాడుతున్నట్లు వుండేది మొదట్లో మీరు నా కంటెకిచ్చిన ప్రాముఖ్యం నాకిచ్చారు కాదు అందుకే అందం లేని పాపంలా నిలబడ్డాను తరవాత-

**గురజాడ:** తరువాత నీవే నేను నేనే నీవు

**మధుర:** రాజా! ఆ రోజుల్లో నిన్ను చూసి అంతా భయపడే వారట, నిజమా?

**గురజాడ:** నన్ను రాజా ఆనే పేరుతో తాతాచార్యులు పిలిచేవాడు నీకెల్లా తెలుసు? నీకు పుణ్యం వుంటుంది నన్ను నువ్వూ నువ్వూ అనకు

**మధుర:** త్వమేవాహం వీణ వాయిస్తారా? యివ్వనా? అదేవిటి చేతులు అలా వణుకుతున్నాయి?

**గురజాడ:** కొంచెం కోకోవైనియ్యి కాస్త ఆగి కాఫీ యియ్యి నరాల నిస్సత్తువు పట్టుకుంది

**మధుర:** గిరీశంగారికి చలిదివణ్ణం, చేదతో బావిలోంచి నీళ్ళు తోడ్డం ఇలాటివే ఏర్పాటుచేశారు గాని, కాస్తవెనుగాని విస్కీ గాని యివ్వలేకపోయారు మీరేం మహాకవులండీ?

**గురజాడ:** నన్ను కవిగా ఎవరూ వప్పుకోందే? డ్రాయింగ్ షీటు పట్రా నీ బొమ్మ గీస్తా

**మధుర:** అవును మీరు చిత్రకారులే నా బొమ్మ గీస్తే నాకివ్వరు దాన్ని మీరే మోహించి వుంచేసుకుంటారు

**గురజాడ:** ఒక కవి తన రచన చూసి తానే పరవశించి పోయాడంటే అందులో నిజంగా జీవం వుందన్న మాట

**మధుర:** నన్నెదురుగా పెట్టుకునా మీరా మాటలనడం?

**గురజాడ:** నువ్వు రామప్పంతులుతోనూ, గిరీశంతోనూ, పిల్లి ఎలుకలతో ఆడుకున్నట్లు ఆడుకున్నావు నాతో మాత్రం ఆడుకోలేవు వచ్చేటప్పుడు నీ దగ్గరకు కళ్ళు మూసుకుపోయి వచ్చినవాడు భ్రమలు పటాపంచలై వెళ్ళేప్పుడు కళ్ళు తెరుచుకుని వెళ్ళిపోతాడు, గిరీశం లాగా

**మధుర:** 'డామిట్ కథ అడ్డంగా తిరిగింది' అన్నారు కదా, అది గిరీరం గారికా, లేక మీకేనా? (నవ్వు)

**గురజాడ:** నీకు కోపం వస్తే చెంబుతో నీళ్ళు తెచ్చి, నా నెత్తిమీద దిమ్మరించినా దిమ్మరిస్తావు నాటకం నీకు నచ్చలేదా?

**మధుర:** అన్నం మెతుకును అన్నవంతా నచ్చిందా అంటే ఏ వంటుంది? కన్యాశుల్కం బీభత్స రసప్రధానమైన విషాదాంత నాటకం అన్నాడుగా కామ్రేడ్ శ్రీ శ్రీ రామ-రామ

**గురజాడ:** నేనల్లా అనుకున్నానా?

**మధుర:** కనిపించని వంద కల్పవృక్షాలకన్న ఒక ''దేశభక్తి'' గీతం మిన్న సన్మానాలు పొందే లక్ష సామ్రాట్టుల కన్న ఒక కామ్రేడ్ గురజాడ మేలు అన్నాడు శ్రీ రంగం వారి చిన్నవాడు

**గురజాడ:** అదేవిటి విశ్వనాథ మనవాడే- అతని మీద దేనికంట వీడు విరుచుకుపడటం?

**మధుర:** చిత్రం చిత్రం మహాచిత్రం అన్నట్లు వుంటాయి మీ మాటలు మిమ్మల్ని కామ్రేడ్ గురజాడ అన్న శ్రీశ్రీని పక్కన పెట్టి మిమ్మల్ని అకవి అన్న విశ్వనాధని మెచ్చుగుంటున్నారు ఏవి చోద్యం?

**గురజాడ:** (నవ్వి) యెంచాతంటే వాడు రాసిన వేయి పడగలు బీభత్స రసప్రధానమైన నవల; నా నాటకం కాదు (నవ్వు) అది అంతే - పైగా అతను నా నాటకంలో రామప్పంతులు వేషం వేశాడు నాలుగేళ్ళు దీక్షగా మాధవాచార్యులు మీనాక్షి

**మధుర:** కన్యాశుల్కంలో వేషం వేసిన వాడు అందులో నా ముద్దుల్ని జుర్రిన రామప్పంతులు, కన్యాశుల్కానికి ఎదురుతిరగడవేమిటి అంటారు పంతులు గారు శ్రీశ్రీ మీ నాటకం బీభత్సం అన్నందుకు మీరు వారిని వొదిలి వీరిని చేరదీయడం సవబా?

**గురజాడ:** నువ్వుండగా నా నాటకంలోకి బీభత్సం ఎలా వస్తుందీ?

**మధుర:** నాతోపాటు గిరీశంగారుండగా నాటకం బీభత్సం ఎలా అవుతుంది?

**గురజాడ:** నా నాటకం రసగంగాధరం అది నాకు తెలుసు, నీకూ తెలుసు శ్రీశ్రీ కేం తెలుసు?

**మధుర:** నేను మిమ్మల్నో మాట అడుగుతాను ఏవీ అనుకోరు గదా?

**గురజాడ:** నాకు పద్యాలు కావ్యాలు రాయడం చాతగాక గేయాలు రాస్తున్నానన్నారు నాటక లక్షణాలు నాకు తెలియవన్నారు అదీ యిదీ చాతగాక యిందులో దిగానని వెక్కిరించారు నేనేమీ అనుకోలేదే? నువ్వడిగితే నేనేవనుకుంటాను? అందులో నా అతి మధురానివి-

**మధుర:** యిందాక నా నాటకం నీకు నచ్చిందా అని అడిగారు నేనేవంటాను? ఆ నాటకం మీకూ లొంగలేదు కొత్త కవిలా అలా రాసుకుంటూ పోవడమేనా? ఎంత రాసినా మీకు తృప్తిలేదు మీజాతే అంత-వాళ్ళంతా ఎలా నడిపిస్తే అలా నడిచారు పాత్రల్ని గారం చేసిన

జనక తండ్రి మీరు. దశరథుని కున్నంత పుత్ర వ్యామోహం మీకూ వుంది మీ పాత్రల మీద అవునా?

**గురజాడ:** నా నాటకాన్ని నేను జాగ్రత్తగా నిర్వహించ లేకపోయా నంటావు అంతేనా? పాత్రల మీది వ్యామోహంతో అది ఎటునడిస్తే అటు వెళ్ళాననీ అలా పెంచుకుంటూ పోయాననీ నీ పాయింటు అది తప్పా? ఒక వేళ నిజమైనా-

**మధుర:** మీకు తెలిసిందంతా ఆ ఒక్క నాటకంలో చెప్పెయ్యాలని మీకు వ్రూహు ఆత్రం తెలుగులో మొదటి నవల మీరే రాసివుంటే అందులో ఎంచక్కా మీరు చెప్పదలుచుకున్నదంతా విప్పిచెప్పగలిగి వుండేవారు అవునా?

**గురజాడ:** నవల రాయకుండా నాటకం రాయడం తప్పయి పోయిందంటావు? నాకు కుదురులేదని నీ ఉద్దేశమా?

**మధుర:** రామ! రామ! నా ఉద్దేశం అది కాదు నవల్లో చెప్పవలసినంత గోలనాటకంలో తెలిసి కావాలని చేశారు అయితే కథ మీకే అడ్డం తిరుగుతోందని తెలిసి అట్టే రంగూ, రుచీ, వాసనా లేని సౌజన్యారావు పంతుల్ని ̄చ్చి అతనిచేత నాకు భగవద్గీత యిప్పించి బతుకు జీవుడా మీరు చల్లగా తప్పుకున్నారు. అవునా?

**గురజాడ:** నాటకం రాసింది పాత్రలచేత మాటలు పడ్డానికే-అను, అను, నీ సొమ్మేం పోయింది! నీకు లోకువయ్యాను పాత్రలకీ లోకువయ్యాను నా జాతకం అలాటిది మరి

**మధుర** :పంతులు గారికి కోపం వచ్చినట్లుంది వీరేశలింగం గారి వితంతువివాహాలు, సంఘ సంస్కరణా మీకు నచ్చలేదు రఘుపతి వెంకట రత్నం నాయుడు గారు యాంటీనాచ్ గనుక ఆయన్ని సౌజన్యారావు పంతులుగా చేసి మీ లౌక్యం ప్రదర్శించారు మిమ్మల్ని కామ్రేడ్ అన్న వాళ్ళే అచ్చంగా గాడిదలు (నవ్వు)

**గురజాడ:** రోకలి తలకు చుడుతున్నావు కానీ, వితంతు జీవితమే నరకం అందులో గిరీశం లాంటి వాళ్ళను పెళ్ళాడితే యింకా మహా నరకం కదా! మన పెళ్ళిళ్ళలో ఆడదానికి లభించని ప్రేమా, స్వేచ్ఛా వీరేశలింగం గారు జరిపే వితంతు వివాహాల్లో మరింత దుర్లభం కదా! ఇదే నన్ను బాధించిన నిజం పిల్లా!

**మధుర:** ఒప్పుగుందాం మరి యాంటీనాచ్ సంగతో

**గురజాడ** : నాయుడుగారి గ్రూపుది వాస్తవ లోకంతో సంబంధం లేని వట్టి నైతిక దృష్టి నాచ్ కొశ్చెన్‌ను ఆర్థిక దృష్టితో సంస్కర్తలు పరిశీలించలేదు. నిజమే ఆ లోపం నన్ను బాధించింది సుమా

**మధుర:** మరి మీరు ఆనంద గజపతి మహారాజులుంగారుంచుకున్న రామస్వామి వెంకటస్వామి రామతిలకం వంటి వేశ్యలకు గార్డియన్‌గా వున్నారు రీవారాణీగారి ఆంతరంగిక కార్యదర్శిగా

పనిచేశారు  కాలేజీలో మేష్టరీ వెలగబెట్టారు. మీకున్న ప్రత్యక్షానుభవం పంతులుగారికి గాని, నాయుడుగారికి గాని యేది? మీ మనస్సు గొప్పది  మీ దృష్టి మరీ కొత్తది నిజవేనా?

**గురజాడ:** రాజమండ్రి, కాకినాడా ముందుకుపోతుంటే విజయనగరాన్ని వెనకబడనిస్తానా?

**మధుర:** గిరీశానికి కర్రకత్తి, యిత్తడి కిరీటం, కొయ్యగుఱ్ఱం యిచ్చి వినాయకుణ్ని చేసి రెండు సమస్యల్నీ నవ్వులపాలు చేశారు

**గురజాడ:** అంటే నీ ఉద్దేశం  గిరీశానికి బుచ్చెమ్మనిచ్చి పెళ్ళి చేయలేదనా?

**మధుర:** కాదు  సంఘ సంస్కర్తలకి కొంచెమైనా లోకజ్ఞానం లేకపోవటం నవ్వు పుట్టించదా? మానవ సమాజంలోని చెడుతోనే సానివారమైన మాకు పరిచయం గాని మంచివాళ్ళు మమ్మల్ని దగ్గరకైనా రానివ్వరు కదా?

**గురజాడ:** అందుకే నీకు మగవేషం వేసి కోటు తొడిగి తలపాగా చుట్టి సౌజన్యారావు పంతులు దగ్గరకు పంపించాను  నా ఆల్టర్ యిగోవి నువ్వు  అందుకే త్వమేవాహం అన్నాను. నాది వాక్కు, నువ్వు నా అర్థానివి

**మధుర:**చాలు చాలు! మీది ముందు చూపు  పందొమ్మిదో శతాబ్దంలో వుండి ఇరవై ఒకటో శతాబ్దంలోకి చూడటం గొప్పే కాని, అదే పాపం మీ అయోగ్యత  సమకాలిక ప్రగతి ఉద్యమాల పట్ల సానుభూతి లేకుండా వెక్కిరించేలా చేసింది మీ ముందు చూపు వీరేశలింగం నిశ్చయంగా మహాపురుషుడు అని చెప్పడానికి మీకు చాలా కాలం పట్టింది కదా! మీ లెక్కలన్నీ తప్పు లేదా?

**గురజాడ:** మరి నీ లెక్క ప్రకారం అదంతా నా పొగరనా  నీ ఉద్దేశం?

**మధుర:** కాదు కోపం  సజ్జనులకు అధర్మాన్ని చూస్తే కలిగే ఆగ్రహం  మీ కోపమే మీ నాటకం  ఆలోచిస్తే కోపం కూడా ఓ రసమే  అదీ ఒ సొగసే-

**గురజాడ:** ఇక నీ కవిత్వాలు చాలించు  కొంపదీసి నాకే పాఠాలు చెప్పేట్లున్నావు?

**మధుర:** తిండి కలిగితె కండ కలదోయ్ కండ కలవాడేను మనిషోయ్ అన్నారు  ఇదేం కవిత్వం? మీకు కండలేక వంట్లో సేరు మాంసం లేదు గనక కండ కలవాళ్ళంతా మీకు మనుషుల్లా కనుపించారు  అవునా? (నవ్వు)

**గురజాడ:** ఈవేళ నన్ను పట్టించావేమిటి? నేన్నిన్ను నెగ్గలనా?

**మధుర:** ఆలోచిస్తే ఇరవైయేళ్ళకు మెట్రిక్ ప్యాసయిన మీరే వెంకటేశం ఎందుకు కాకూడదు అని నవ్వు వచ్చింది  అంత టైం యెందుకు తీసుకున్నారు?

**గురజాడ:** నాలాగే వీరేశలింగం గారు కూడా ఆలిస్యం చేశారు మెట్రిక్ దాటేందుకు. ఇద్దరం ఫస్టుగా ప్యాసయిన వాళ్ళమే

**మధుర:** బావుంది పోలిక తోడు దొంగల్లా-చదువుల్లో వెనకబడిన వాళ్ళే తరవాత చదువుల్ని శాసిస్తారు. కాదా? (నవ్వు)

**గురజాడ:** నా నాటకం లాగే నేనూ కొందరికి అందను అంటే అర్థం కాను

**మధుర:** కన్యాశుల్కం నాటకం కాదన్న వాళ్ళకి నాటకం అంటే యేమీ తెలియదని మనం సరి పెట్టేసుకోవాలి శిథిలమవుతున్న రాజరికానికి మీరు నమ్మినబంటు అందుకే మీరంటే అదో లోకువ కొందరికి. కాదా?

**గురజాడ:** శిథిల వ్యవస్థలో వుండి దానికి సేవచేసి ఆరోగ్యం చెడగొట్టుకున్నాను తరవాత దాని గురించే నాటకం రాసుగుని తరించాను కబుర్లాడు తున్నావుగాని నువ్వూ ఆ గూటి చిలకవే ఆ ఆటే ఆ పాటే నీది

**మధుర:** కాదన్నానా? పెద్దదావా, కోటలో కొలువూ మిమ్మల్నీ మీ ఆరోగ్యాన్నీ హరించి వెయ్యకపోతే కొండు భట్టీయం, బిల్హణీయం మరిన్ని నాటకాలు రాసివుండే వారు కాదా! నన్ను మీరు వదలలేకపోయారు, గిరీశం గారు మిమ్మల్ని వదల్లేదు మే గాడ్ బ్లెస్ యూ సర్! (అని రొమ్ముపై క్రాస్ వేసి ఆమెన్ అన్నట్లు వంగి సలాం కొడుతుంది)

**గురజాడ:** నేను కన్యాశుల్కానికి సీక్వెల్ రాద్దామనుకున్నా ఓ మాటు ట్రంకు పెట్టి రాసుకున్న కాగితాల్తో రైల్లోపోయింది తరువాత పెద్దదావా వల్ల రాయడం కుదిరింది కాదు ఏమిటో? అనుకున్నవి అనుకున్నట్లు సాగవు

**మధుర:** మీకెందుకండీ ఆ శాసనాలు? కళింగదేశచరిత్ర ఏదో రాద్దామనుకున్నారు లక్ష్యశుద్ధిలేక దారితప్పారు అవునా?

**గురజాడ:** అదేం మాట-కోటలో నా ఉద్యోగం ఎపిగ్రఫిస్టే అది నా డ్యూటీ

**మధుర:** అందుకే దొరలచేత మాటలు పడ్డారు నీ ఉద్యోగమేదో నువ్వు చూసుకోక కోటలో జొరబడతావు, నీకేం పనయ్యా అని కోట అంతా నాదే అన్నట్లు పూసుకు తిరిగేవారు అవునా?

**గురజాడ:** నాకు చదువు చెప్పించి నన్ను పెంచి పెద్దవాణ్ని చేసిన ఆనంద గజపతి మహారాజా వారికి నేనేం చేసినా నా ఋణం తీరదు ఆ కృతజ్ఞతా భావం నన్ను కోటకు కట్టిపడేసింది అది తప్పెలాగవుతుంది?

**మధుర:** మిమ్మల్ని వాళ్ళు అలా వాడేసుకోవడం వలన మీ సాహిత్య కృషి చాలా కుంటుపడింది. రాయవలసినంత రాయలేక పోయారు. పైగా పరీక్షా పత్రాలు, పాఠాలూ-పుస్తకాలూ ఒకటా మీకు.

**గురజాడు:** నా రథానికి నాలుగు చక్రాలు రథ సైకం చక్రం కాదు

**మధుర:** ఏమిటో ఆ నాలుగు చక్రాలు?

**గురజాడ:** మహారాజా వారి కొలువు తదనంతరం దివాణం సేవ, పెద్ద దావా యిదంతా ఒక చక్రం అయితే-

**మధుర:** రెండోది శాసన పరిశోధన, కళింగదేశ చరిత్ర, రాజా వారి పూర్వులను వెతికి ( ఆగి) కీర్తిశేషుల్ని తవ్వి కీర్తిని వెలికి తీసి చూపడం- యిదంతా శుద్ధ దండగ చాకిరీ- గిరీశంగారే మీ చరిత్ర రాస్తే మీ జీవితం అంతా శుద్ధ దండగ అనగా వేస్టయి పోయిందని రాసుండేవాడు

**గురజాడ:** ఔరా ఇంద్రజాలీ! నువ్వే యింగ్లీషు చదువుకుంటే లాయర్ మధురవాణి వయి జడ్జీల యెదుట నీ వాగ్ధాటితో ఫెళ ఫెళలాడించే దానివి

**మధుర:** మిగతా చక్రాల సంగతి నన్ను చెప్పమంటారా? మీరే చెబుతారా?

**గురజాడ:** ఒకటి సోషల్ రిఫాం అనగా సంఘ సంస్కరణ, రెండోది లాంగ్వేజి రిఫాం అంటే, వ్యావహారిక భాషా ఉద్యమం

**మధుర:** కొంప ముంచారు అంకుల్ వరవీణామృదుపాణిని యేం చేశారు?

**గురజాడ:** అంతా నాకు ఓ నమస్కారంచేసి, మహాకవో, యుగకర్తో అని పండితుల చేత తిట్టించి తమ దారిని రాసుకుపోయారు గాని ఒక్కడూ నా మార్గం ఫాలో అవలేదు

**మధుర:** అదా మీ విచారం పాపం రమణారెడ్డి 'మహోదయం' అని మీ గురించి ఒక బృహత్ కవిలికట్ట రాశాడు చూడలేదా?

**గురజాడ:** నన్ను తిట్టిన వాళ్ళతో పేచీల్లేవు కాని అంతా నన్ను కావిలించుగున్న వాళ్ళ నించే ప్రాబ్లమ్స్ ఒకడు నన్ను మహాకవి అన్న వాళ్ళ మీద విరుచుకుపడ్డాడు, ఏమో అన్నారు నేను రాసినట్లు రాయకుండా నన్ను కేవలం సమర్థించే వాళ్ళ వల్ల నాకు ఎక్కువ డామేజి జరిగిందనుకుంటున్నాను నేను కన్యాశుల్కం రాశాక ఎన్నాళ్ళకో నా నాటకంలో రామప్పంతులు వేసి నన్ను తన శిష్యుడి చేత అకవి అని తిట్టించిన సత్యన్నారాయణ 'వేయి పడగలు' రాశాడు

**మధుర:** గురూజీ మీరు వేయి పడగలు చదివారా?

**గురజాడ:** అసిరిగాణ్ని పంపించి తెప్పించాను లైబ్రరీ ఆఫ్ ది హెల్ నుంచి

**మధుర:** అన్నట్లు శ్రీశ్రీ, విశ్వనాథ అంతా నరకంలోనే గదా వుంట రామాయణం రాసినా మహాకవులు వుండేది అక్షరాలా నరకంలోనే

**గురజాడ:** నువ్వో మాటు అక్కడికి రారాదూ మన వాళ్ళందర్నీ చూడొచ్చు

**మధుర:** చెడిన వారిని పూర్తిగా చెడగొట్టమని చెప్పలేదు మా తల్లి ఏదో చెప్పబోయారు?

**గురజాడ:** కన్యాశుల్కంలో ముసలాళ్ళకు డబ్బు తీసుకుని చిన్న పిల్లల్నివ్వకూడదని నేను రాస్తే, యీకవి సద్రమాట్లు తన హీరోకి తన ఫ్రెండ్ కూతుర్ని (పెళ్ళం పోతే) అదే సేరిటి

చిన్న గుంటని కట్టబెడతాడు ఎనిమిదేళ్ళ పిల్లకి పెళ్ళిచేస్తే దాని బుర్రలోకి అన్య పురుషభావం ప్రవేశించకుండా పెళ్ళికొడుకు అంటే వరుని ప్రతిమ బ్లాక్ చేస్తుందట రైళ్ళు, బస్సులు రావడం ధర్మగ్లాని అంటాడు పంపులు పెట్టడం మునిసిపాలిటీలు ఏర్పడడం, ప్రజాస్వామికం రావడం అంతా పతనమే దోషమే మార్పుని యింతగా ద్వేషించే మహాకవిని నేనెక్కడా చూడలా

**మధుర:** మీరేం వర్రీ అవకండి నాన్నగారూ! ఈ కవి సమ్రాట్ గారి మనుమలు మనవరాళ్ళు, కొందరు అమెరికాలో మరికొందరు యిప్పుడు కాన్వెంట్లలో చదువుకుంటున్నారు వాళ్ళెవరికీ తెలుగురాదు తాత గారి పుస్తకాలు చదివి బాగుపడే అవకాశం లేదు కవులు ఫాలో గాక పోయినా రచయితలు మిమ్మల్నే ఫాలో అయ్యారు

**గురజాడ:** నన్ను ఫాలో అయ్యారా లేదా అన్నది కాదు ప్రశ్న - దేశం ముందు కెళ్తోందా, వెనక్కెళ్తోందా అన్నది సమస్య

**మధుర:** బ్రాహ్మల్లో గొప్పవాళ్ళనీ, మంచివాళ్ళనీ, పండితుల్నీ, జ్ఞానుల్నీ, కవుల్నీ వదిలేసి లుబ్ధావధాన్లు, అగ్నిహోత్రావధానులు వం , పాత్రల ద్వారా చెడును పైకెత్తారనీ - కన్యాశుల్కం ద్వారా బ్రాహ్మణ ద్వేషాగ్నిలో ఆజ్యం పోశారనీ యిలాంటి మాటలే కవి సమ్రాట్‌గా రన్నార్ల యు వర్ ఎ బ్యాడ్ పొయెట్!

**గురజాడ:** ఆయనేవన్నాడో ఆయన్నే ఇంటర్వ్యూ చెయ్యరాదా? ఎవరో అన్న దానికి జవాబులు చెబుతూ కూర్చోవాలా? బ్రాహ్మలు నవ్వుల పాలయ్యింది నా వల్ల కాదు

**మధుర:** ఏ కర్రకు నిప్పుంటే ఆ కర్రే కాల్తుంది అంటారు అయితే నాకు విశ్వనాథ వారితో ఇంటర్వ్యూ తప్పదంటారు జో ఆజ్ఞా-

**గురజాడ:** ముందు శ్రీశ్రీని కదిలించి చూడు నేను రాసిందంతా పోయి దేశభక్తి గీతం ఒక్కటి వున్నా చాలు అన్నాడని గదా నీ అలుక - అన్నీ అడుగు ఒదలకు-

**మధుర:** కన్యాశుల్కం మీరు రాయలేదనీ, ఎవడో శ్రీనివాసాచారి రాశాడనీ వావిళ్ళశాస్త్రుర్లు జరుక్‌శాస్త్రికి చెప్తే, జరుక్ ఆంధ్రపత్రికలో అల్లరి లేవదీశాడు వాళ్ళంతా యిప్పుడు యిక్కడ్నే మన హాల్‌లోనే వున్నారు పిలిపించనా?

**గురజాడ:** బ్రాహ్మల్లో కూడా మహాత్ములుంటారని-రుజువు చెయ్యదలచుకొంటే పిలిపించు

**మధుర:** తప్పయింది లెంపలు వాయించుకుంటాను అవును మొదట దీన్ని యీ నాటకాన్ని మీరు ప్రబంధ భాషలో రాసి అది రుచించక పోవడం వల్ల గ్రామ్యంలో తిరగ రాశారని మీరే వేలూరి శివరామశాస్త్రిగారితో అన్నార్ట అది నిజమా?

**గురజాడ:** సత్యన్నారాయణ డైలీ యమధర్మరాజుకి 'రామాయణ కల్పవృక్షం' వినిపిస్తున్నాడ్ట ఆ సభకి వేలూరి శివరామశాస్త్రి, అధ్యక్షుడు నేవెళ్ళినపుడు నువ్వుకూడా వస్తే నువ్వే అడుగుదువు గాని ఆ మాట-

**మధుర:** నన్ను కూడా ఎందుకా నరకంలోకి లాగాలని చూస్తారు?

**గురజాడ:** నువ్వెక్కడ వుంటే అక్కడది స్వర్గం గాక మరే మవుతుంది?

**మధుర:** అన్నట్టు బ్రింజాల్స్ అంటే ఏవిటండీ?

**గురజాడ:** మధ్యలో నీకు బ్రింజాల్స్ చింత దేనికి?

**మధుర:** అవసరాల సుర్యారావు మీరు బ్రింజాల్స్ అని ఇంగ్లీషులో రాసిందానికి పచ్చిమిరపకాయలని తెనుగు చేశాడ్ట

**గురజాడ:** నా కాగితాల ట్రంకు పెట్టె వాడికి వెళ్ళినట్లుంది (నవ్వు) వాడికితోచినట్లు వాడు రాశాడు నాకు అంతే ప్రాప్తి

**మధుర:** యుగకర్త, మహాకవి అన్న వాళ్ళు ఆ మాత్రం చనువు తీసుకోకూడదా యేమి?

**గురజాడ:** సి ఆర్ రెడ్డిని పిలు వాడూ తెలుగు నరకంలోనే వుంటాడు వాడికి చెప్పు నీ ఫిర్యాదులు రెడ్డి వీళ్ళకు బాగా డోస్ యిస్తాడు

**మధుర:** మీది నిర్మలమైన హాస్యం అని రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ మెచ్చుకున్నాడు సద్బ్రాహ్మడు ఇక్కడికి రాడు ఇహరెడ్డి గారి సంగతి సరేసరి ఆయన పగలబడి నవ్వేవారట అందరూ కలుసుకున్నపుడు కన్యాశుల్కం డైలాగులు అప్పుడప్పుడం ఆదో వేడుక కావలిస్తే జరుక్ని, హనుమచ్ఛాస్త్రిని, శ్రీశ్రీని అడగండి ఇక్కడా అదే గోల

**గురజాడ:** నువ్వుండగా నేనెవర్నీ ఏదీ అడగదల్చుకోలేదు

**మధుర:** విజయనగరంలో మీ విగ్రహం చూశారా? (నవ్వు) విజయనగరం నిర్లక్ష్యానికి మీరు అప్పుడూ యిప్పుడూ గురవుతూ వస్తున్నారు మిమ్మల్ని సప్రెస్ చేసిందీ విజయనగరమే విజయనగరాని కెంత చేశారు?

**గురజాడ:** డామిట్ - కథలు అడ్డాలు తిరక్కేంచేస్తాయి? అన్నట్టు బంగోరె అనే నెల్లూరి కుర్రాడొకడు సట్లెజ్‌లో దూకి యిక్కడకు వచ్చుండాలి రేపు వాడికోసారి కబురంపించు నా నాటకం ఒక్కసారి చదివినా వాడు ఎన్నడూ ఆత్మహత్య చేసుకోలేడు ఎందుకంటే నా హ్యూమర్ ఫెయిలవదు హాస్యం నా చక్రాయుధం

**మధుర:** అడుగో - అసిరిగాడు ఒక వేలు చూపించి ఓ రూపాయి తెమ్మంటున్నాడు

**గురజాడ:** దేనికి?

**మధుర:** శ్రీశ్రీని పిల్చుకు రావడానికి

**గురజాడ:** శ్రీశ్రీ దగ్గర నీ పేరు చెప్పి మరో రెండ్రూపాయలు గుంజుతాడు

(ఉభయులూ నవ్వు) ★

*('మిసిమి' - మార్చి, ఏప్రిల్, మే - 1991)*